## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ షేక్‌బాషా శనివారం తెలిపారు. సంఘిగూడ, చిన్నగోల్కొండ ఫీడర్ పరిధిలోని సంఘిగూడ, రషీద్‌గూడ, పోశెట్టిగూడ, తొండుపల్లి ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, చిన్నగోల్కొండ ఫీడర్ పరిధిలోని పెద్దగోల్కొండ, బహదూర్‌గూడ, లక్ష్మీ తండాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, గండిగూడ ఏజీఎల్ ఫీడర్ పరిధిలోని బుర్జుగడ్డ తండా, గండిగూడలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ముచ్చింతల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ముచ్చింతల్, మదన్‌పల్లి, గచ్చిబాయి తండాల్లో సరఫరా ఉండదు.

మైలార్‌దేవ్‌పల్లి : గగన్‌పహాడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలుప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా ఆదివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. జై భవాని, మీనాక్షి, సాతంరాయి ఇండస్ట్రీయల్, శివశక్తి ఫీడర్ల పరిధిలో ఉదయం 9 : 30 నుంచి 12:30 వరకు సాతంరాయి, బీఎస్ఎన్ఎల్ టవర్స్ గల్లీ, మెట్రోమాల్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2:30 నుంచి 5:50 గంటల వరకు, పిలికాన్ రబ్బర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు, ఐజీహెచ్ఎస్ ఫీడర్లలో మధ్యాహ్నం 2:30 నుంచి 3 గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, శ్రీరామ్ కాలనీ బుద్వేల్, పూజాగల్లీ ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

## గంజాయి సేవిస్తున్న యువకుడి అరెస్ట్

బంజారాహిల్స్, జూన్ 14 : గంజాయి సేవిస్తున్న యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే .. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని సయ్యద్‌నగర్‌లో నివసించే సయ్యద్ ఇబ్రహీం ఫాల్ సీలింగ్ పనులు చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి ఎన్‌బీటీ నగర్‌లోని మేయర్ నివాసం సమీపంలో ఖాళీ స్థలంలో గంజాయి సేవిస్తున్న విషయాన్ని విశ్వసనీయంగా తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నిందితుడు ఇబ్రహీంను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి వద్ద సోదా చేయగా ఐదు గ్రాముల గంజాయి లభ్యమైంది. దాంతో పోలీసులు ఎన్‌డీపీఎస్ కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేశారు.

# రోడ్లన్నీ..గుంతలమయం

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 14 : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. దుర్గానగర్, మైలార్‌దేవ్‌పల్లి, బాబుల్‌రెడ్డి నగర్, కాటేదాన్, ఓల్డ్ కర్నూల్ రోడ్డు ప్రాంతాల్లోని రోడ్లన్నీ చిన్న వర్షానికే గుంతలమయంగా మారాయి. కాటేదాన్ నుంచి గగన్‌పహాడ్ వరకు ప్రధాన రహదారిపై ఎక్కడికక్కడే భారీ గుంతలు పడి వాహనాలు అందులో చిక్కుకోవడంతో పాటు కిందపడి గాయాలకు గురవుతున్న ఘటనలు అనేకం. కాంట్రాక్టర్లు నాసిరకమైన రోడ్లు వేయడం ఒక కారణమైతే అధికారులు, నాయకుల పర్యవేక్షణ లోపంతోనే ఈ పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు, వాహనదారులు విమర్శిస్తున్నారు.



కాటేదాన్ నుంచి గగన్‌పహాడ్ వెళ్లే రహదారిపై ప్రమాదకరంగా మారిన రోడ్లు.

### రాకపోకలకు అవస్థలు ..

రోడ్లన్నీ గుంతలమయం కావడంతో కార్లు, ద్విచక్ర వాహనదారులు అక్కడి నుంచి పోవాలంటే ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. పాదచారులకు కూడా ఆయా ప్రాంతాల నుంచి నడవాలంటే ఒకింత ఇబ్బందులకు గురవుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లే సమయంలో గుంతల్లోని నీళ్లు రహదారిపై పడుతున్నాయని చెబుతున్నారు. ఈ పరిస్థితి కొని నెలలు గడుస్తున్న మరమ్మతులు చేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### చిన్నపాటి వానలకే రోడ్లు చిత్తడి..



చిన్నపాటి వానలకే రోడ్లు చిత్తడిగా అవుతున్నాయి. గోతులుగా ఉన్న రోడ్లల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ఎక్కడ గోతి ఉందో ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితి నెలకొన్నది. సమస్య రాకుండా ముందే అధికారులు చొరవ తీసుకోవాలి. తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో వాహనాదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకు వెళ్లిన స్పందన మాత్రం కరువవుతున్నది.

**— ఏర్వ కుమారస్వామి, ఆదర్శనగర్**

### శాశ్వత పరిష్కారం చూపించాలి..



వర్షాకాలం వచ్చినందున రోడ్ల మరమ్మతులు వెంటనే చేయించాలి. ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలి. ఈ దారులపై ప్రయాణించాలంటేనే నరకయాతన అనుభవిస్తున్నాం. గోతులమయంగా ఉన్న రోడ్ల కారణంగా ట్రాఫిక్ సైతం అధికంగా జాం అవుతున్నది. ప్రజలకు ఇబ్బందులు కలిగించే గోతుల సమస్యపై శాశ్వత పరిష్కారాలు చూపించాలి

**— కొంపల్లి జగదీశ్, శ్రీరామ్ నగర్**



## ఘన నివాళి..

జూబ్లీహిల్స్ : కార్యకర్తలే పార్టీకి పునాదులని నమ్మి.. వారిలో ఒకడిగా ఉన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణాన్ని శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నారు. శనివారం యూసుఫ్‌గూడలోని లక్ష్మీ నరసింహనగర్‌లో యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్‌పటేల్ ఆధ్వర్యంలో మాగంటి గోపీనాథ్ సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. మాగంటి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గంతో పాటు యూసుఫ్‌గూడ డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే మాగంటి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నర్సింగ్ దాస్ నాయకులు బసవ రాజు, వేణు గోపాల్, ఎస్. శ్రీనివాస్ యాదవ్, సత్యనారాయణ, గోపాల స్వామి, శ్రీనివాస్, సంతోష్, కనకయ్య గౌడ్, నవీన్ పటేల్, శరత్, హసన్, శంకర్, బంది రాజు, గణేశ్, నాగ, ఫయీమ్, షబ్బీర్, వెంకటేష్, కోటేశ్వర రావు, గిరి, సలీం, జితేందర్, అమ్మాజీ, స్రవంతి, మాధవి, అరుణ, అశోక, రమాదేవి, నిర్మల, విజయ, రమాదేవి, రజిని, సీహెచ్ సాయి లక్ష్మి, ప్రసన్న, గీత పాల్గొన్నారు.

# ఎక్కడ చూసినా.. చెత్తాచెదారం



ఇబ్రహీంనగర్ రోడ్డులో సగభాగం ఆక్రమించిన చెత్త, నిర్మాణవ్యర్థాలు

బంజారాహిల్స్, జూన్ 14 : ప్రీ మాన్‌సూన్ శానిటేషన్ డ్రైవ్ ద్వారా ప్రతివీధిని శుభ్రం చేస్తామని ప్రకటించిన పారిశుధ్య విభాగం సిబ్బంది పత్తా లేకుండా పోయారు. జీహెచ్ఎంసీ సర్కిల్ –18 పరిధిలోని బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్, షేక్‌పేట డివిజన్ల పరిధిలో రెండుమూడు రోజులు హడావుడి చేసిన బల్దియా సిబ్బంది చేతులెత్తేశారు. 15 రోజుల క్రితం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి చేతులమీదుగా ప్రీ మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ పేరుతో ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. అయినా బంజారాహిల్స్ రోడ్ నం.3లోని పోలీస్‌స్టేషన్, రోడ్ నం.14లోని ఇబ్రహీంనగర్, ఇందిరానగర్, ఎన్‌బీ నగర్, ఎన్‌బీటీ నగర్, శ్రీరాం నగర్ ప్రాంతాల్లో భారీగా వ్యర్థాలు పేరుకుపోయాయి. ఆయా ప్రాంతాల్లో ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు వర్షాలు .. మరోవైపు చెత్తను తొలగించకపోతే రోగాల పాలవడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు స్పందించి చెత్త తరలింపుపై శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

# మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్‌రావు



నియామక పత్రాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, కార్తీక్ రెడ్డి

మణికొండ, జూన్ 14 : తెలంగాణ రాష్ట్రసాధనకై తొలి, మలి ఉద్యమాల్లో పాల్గొన్న తెలంగాణ వాది, సమాజ సేవకుడు, 50 ఏండ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో సేవయే పరమావధిగా, ప్రజల హక్కుల సాధనకై సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్న అందె లక్ష్మణ్‌రావుకు మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఉపాధ్యక్ష పదవిని కట్టబెట్టారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పి. కార్తీక్ రెడ్డి, స్థానిక అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ సమష్టి నిర్ణయంతో శనివారం ప్రకటించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అందె లక్ష్మణ్ మాట్లాడుతూ.. సంపూర్ణమైన విశ్వాసాన్ని ఉంచి పార్టీ అధిష్ఠానం మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. మణికొండలో నాయకులు, కార్యకర్తలకు అనుసంధాన కర్తగా ఉంటూ యువతకు మార్గదర్శనం చేస్తానన్నారు.

# కురుమల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న గండిపేట మండల కురుమ సంఘం అధ్యక్షుడు భాస్కర్ కురుమ

మణికొండ : కురుమల అభ్యున్నతికి కృషి చేస్తానని రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ కురుమ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల ఏఎఫ్ గార్డెన్స్‌లో శనివారం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమానికి బండారు నారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. గండిపేట మండల నూతన అధ్యక్షుడు దొబ్బ భాస్కర్ కురుమ అధ్యక్షత నూతన పాలకవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. గత ప్రభుత్వ హయాంలో కోకాపేటలో కురుమ సంఘం భవనం నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభించుకున్న ఘనత కురుమలదేనన్నారు. బీరప్ప, మల్లన్న ఆలయాలను నిర్మించుకుని కురుమల చరిత్రను చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం ప్రతినిధులు నర్సింహులు, అరుణ్‌కుమార్, పుష్పనాగేశ్, గౌరీ సతీశ్, సదానందం, లక్ష్మీ నారాయణ, ముత్యాలు, నార్సింగి సహకార సంఘం చైర్మన్ తోలుకట్టె కృష్ణ, ప్రతినిధులు గణేశ్, రమేశ్, విఠల్, లక్ష్మణ్, శివరాజ్, వివిధ గ్రామాల కురుమ సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హాక్ ఫిక్స్.. సీజన్ 2 ప్రారంభం



హిమాయత్ సాగర్ లార్డ్స్ కళాశాలలో శనివారం హాక్ ఫిక్స్ కార్యక్రమం ప్రారంభించారు. ఆధునిక పద్ధతిలో ఏఐ సహకారంతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పద్ధతులను కనుగొనేందుకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లార్డ్స్ కళాశాల నిర్వాహకులు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి 3000 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 550 మందిని ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. వారు 36 గంటల పాటు శ్రమించి పలు ప్రాజెక్టులను డెవలప్ చేసి చూపించారన్నారు. డేటా సైన్స్, ఏంబడేడ్, మిషన్ లెర్నింగ్, కృత్రిమ మేథస్సు వంటి వాటిలో ప్రతిభను కనబరిచినట్లు లార్డ్స్ కళాశాల వైస్ చైర్మన్ తౌశిక్ అహ్మద్ తెలిపారు. **- బండ్లగూడ**



## సామాజిక సేవకు గుర్తింపు..

ఎర్రగడ్డ, జూన్ 14: ఎర్రగడ్డ డివిజన్ కల్యాణ్‌నగర్‌కు చెందిన కళ్లెం శ్రీనివాస్ రెడ్డి విద్యుత్ సౌధ అకౌంట్స్ విభాగంలో అధికారి. ఆయన చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన అమెరికన్ యూనివర్సిటీ ఇటీవల డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. డాక్టరేట్‌ను అందుకున్న శ్రీనివాస్ రెడ్డిని తోటి అధికారులు లక్ష్మి శ్రీ, శ్రీనివాసరావు, టి.రమేశ్, చంద్రశేఖర్ రెడ్డి, సోమయాజులు, దామెర శ్రీనివాస్, సిర్రా ఆనంద్ కుమార్ సన్మానించారు.

## మానవత్వం చాటుకున్న హోంగార్డ్

వెంగళరావునగర్ : ఆప్యాయత పంచి.. ఆకలి తీర్చి.. మతిస్థిమితం లేని మహిళలపై మానవత్వంతో సేవలు అందించింది ఎస్ఆర్ నగర్ పీఎస్ హోం గార్డ్ లక్ష్మి. కొన్నాళ్లుగా మతిస్థిమితం లేక రోడ్లపై తిరుగుతూ తల్లీకూతుళ్లు రహదారిపై వెళ్తున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. శనివారం అమీర్‌పేట స్టేషన్ వద్ద న్యూసెన్స్ చేయడంతో వారిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు తెచ్చారు. ఆకలిదప్పులతో అలాంటిస్తున్న వారిద్దర్నీ చేరదీసి అన్నంముద్దలు తినిపించి ఆకలితీర్చింది హోంగార్డు లక్ష్మి . సపర్యలు చేసి.. ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చికిత్స కోసం చేర్పించారు. కాఠిన్యమే కాదు.. కారుణ్యం కూడా ఖాకీ గుండెలకు ఉంటుందని నిరూపించింది.

## మద్యం మత్తులో డ్రైవింగ్.. వేర్వేరు ఘటనల్లో ఐదుగురు అరెస్ట్

బంజారాహిల్స్ : మద్యం మత్తులో కారు నడుపుతూ ప్రమాదానికి కారణమైన రెండు ఘటనల్లో ఐదుగురు వ్యక్తులను ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట్, ఓయూ కాలనీలో ఉంటున్న వడ్ల వెంకటేశ్ కారు డ్రైవర్. శుక్రవారం రాత్రి తన స్నేహితులు శ్రీను, కిరణ్, అనిల్‌తో కలిసి మల్కంచెరువు వద్ద అర్ధరాత్రి 2 గంటల దాకా మద్యం సేవించారు. ఇంటికి బయలుదేరిన వెంకటేశ్ మత్తులో కారులో వస్తున్న క్రమంలో ఓ ఇంటి ఎదుట పార్కు చేసిన కారును ఢీకొట్టాడు. దీంతో బాధితుడు అజారుద్దీన్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవింగ్ చేస్తున్న వెంకటేశ్‌తో సహా నలుగురికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా వాళ్లంతా మద్యం సేవించినట్లు తేలింది. వీరిపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేశారు.

### మరో ఘటనలో..

అపోలో దవాఖాన సమీపంలో మణికొండ ప్రాంతానికి చెందిన హరీశ్ తన బోటిక్‌లో మద్యం సేవించి శుక్రవారం అర్ధరాత్రి కారులో ఇంటికి బయలుదేరాడు. మహనీయుల చౌరస్తా వద్దకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రఘుపతి వెంకయ్య విగ్రహం దిమ్మను ఢీ కొట్టాడు. దిమ్మె పూర్తిగా దెబ్బతినగా స్థానికులు ఫిలింనగర్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకొన్న పోలీసులు హరీశ్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయగా మద్యం సేవించినట్లు తెలిసింది. దీంతో అతడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

# యాదాద్రి కాలనీలో సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న యాదాద్రి కాలనీవాసులు

బండ్లగూడ : యాదాద్రి కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి కాలనీ వాసులు శనివారం వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. తమ కాలనీ ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ మౌలిక వసతులు లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తాగునీటి వసతి, రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో చర్చించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు మధుకర్, రఘు గౌడ్, సంపత్ గౌడ్, బుజ్జా నాయక్, నరేందర్ రెడ్డి, మహేశ్, శ్యామ్ లాల్, రాజేశ్, కిష్టప్ప పాల్గొన్నారు.

### ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపడతామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్, దర్గా, భవానీ నగర్ కాలనీల్లో రూ.6.92 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

### పరధ్యానంలో అధికారులు..

బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ విచ్చేశారు. భవానీనగర్ కాలనీలో పార్క్ అభివృద్ధి కోసం రూ.24 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కాలనీవాసులు అక్కడే సమావేశం ఏర్పాటు చేయడంతో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కాలనీ అభివృద్ధిని వివరించారు. ఈఈ వివరణలో భాగంగా పార్కు అభివృద్ధికి ఎన్ని నిధులను కేటాయించామనేది మరిచిపోయి పక్కనే ఉన్న కమిషనర్ శరత్ చంద్రను నిధుల కోసం ఆరా తీయగా ఆయన కూడా తడబడ్డారు. దీంతో ఎమ్మెల్యే సర్దుకు పోతూ మాట్లాడారు. వెంటనే కమిషనర్ శరత్ చంద్ర ఇంజినీరింగ్ విభాగం అధికారులను పార్కు సంబంధించిన అంచనా వ్యయాన్ని అడిగి తెలుసుకుని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వివరించారు.కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యాదయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, మేనేజర్ పర్వతాలు ఇతర సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీవాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# చేగువేరా జీవితం ఆదర్శం



చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పిస్తున్న నాయకులు

హిమాయత్ నగర్ : విప్లవ పోరాట యోధుడు చేగువేరా జీవితం యువతకు ఆదర్శమని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లా ఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్ తెలిపారు. చేగువేరా జయంతి సందర్భంగా హిమాయత్‌నగర్ లోని ఎస్ఎన్ రెడ్డి భవన్ వద్ద చేగువేరా చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, శ్రీనివాస్, టి.సత్యప్రసాద్, మహేందర్,శ్రీమాన్, కొండల్, మహేశ్, ఉపేంద్ర, సల్మాన్‌బేగ్, శివకుమార్, రాజేశ్, మహమూద్, మాజీద్, మధు పాల్గొన్నారు.

## భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

బండ్లగూడ : అనుమానాస్పద స్థితిలో భవనంపై నుంచి కిందపడి కార్మికుడు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపి వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్‌కు చెందిన సాహూ (28) నగరానికి వచ్చి ఉంటున్నాడు. శనివారం హైదర్‌గూడ, జనప్రియ వద్ద ఓ భవన నిర్మాణంలో పని చేస్తూ ఎనిమిదవ అంతస్తు నుంచి కిందపడ్డాడు. తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని అక్కడివారు తెలుపగా.. కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదని వాదించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు సబ్ ఇన్స్‌పెక్టర్ భానుమతి తెలిపారు.

# 22న మున్నూరు కాపు సంఘం సమావేశం

కాచిగూడ : రాష్ట్ర జనాభాలో 12 శాతం ఉన్న మున్నూరు కాపులను సీఎం మంత్రివర్గంలో చోటు కల్పించకుండా పక్కన పెట్టాడని, దీనికి కారణం మున్నూరు కాపుల్లో ఐక్యత లేకపోవడమేనని తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అన్నారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రేటర్ అధ్యక్షుడు మహేందర్ కుమార్, వెంకన్న పటేల్, డాక్టర్ విశాల్ పటేల్ తో కలిసి ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపులను ఐక్యం చేయడానికి ఈనెల 22 న సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్‌లో రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

## ప్రైవేటు పాఠశాలల నుంచి తీసుకువస్తే బాగుంటుంది



శంషాబాద్ రూరల్ : యూపీఎస్ ముచ్చింతల్ పాఠశాలకు ఒకే రోజు 800 మంది నూతన అడ్మిషన్లు రావడం సంతోషం. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లేవారిని తీసుకురావాలి కానీ.. ప్రభుత్వ పాఠశాలల నుంచి తీసుకువస్తే గిరిజన తండాల్లో పాఠశాలలు మూతపడే అవకాశం ఉందని టీఎస్‌యూటీఎఫ్ శంషాబాద్ మండలాధ్యక్షుడు బాల్‌రాజు శనివారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం చెబుతున్న విషయం తెలిసిందే. కానీ.. ప్రైవేటు పాఠశాల విద్యార్థులను కాకుండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీసుకువస్తే ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. గచ్చిబాయితండాలో 30 మంది విద్యార్థులుండగా అందరినీ తీసుకువచ్చి ముచ్చింతల్ పాఠశాలలో చేర్పించారు. దీంతో గచ్చిగాయితండాలో విద్యార్థులు ఎవ్వరూ లేరని హెచ్ఎం రాములు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. దీంతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన బుర్జుగడ్డతండా, శంకరాపూర్, షాపూర్‌తండా, మదన్‌పల్లితండాతో పాటు వివిధ తండాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేకుండా ఆయా ప్రభుత్వ పాఠశాలలు మూతపడే అవకాశం ఉందని వివరించారు. ముచ్చింతల్ పాఠశాలలో చేరికలపై ఉన్నతాధికారులు దృష్టిసారించి గిరిజన తండాలో ప్రభుత్వ పాఠశాలలు కొనసాగే విధంగా చూడాలని కోరారు.

### 15వ వార్షికోత్సవం



ఎర్రగడ్డ: బోరబండ బస్ టెర్మినల్ సమీపంలోని దేవాదాయ శాఖకు చెందిన షిర్డీ సాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. దాతలు గొట్టిపాటి నరసింహం కుటుంబం, అల్లాడబోయిన సతీశ్ కుటుంబం సహకారం అందించాడు. పూజలకు ప్రధాన అర్చకుడు హేమాకేశవ చారి నేతృత్వం వహించారు. ఆలయ చైర్మన్ ఆనంద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.